క్లుప్తంగా

సీజనల్ రోగాల పట్ల అప్రమత్తత అవసరం



ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు : వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ రోగాల పట్ల వైద్య సిబ్బంది చెప్పే ఆరోగ్య జాగ్రత్తలను ప్రజలు తప్పక పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి నిర్మల సూచించారు. గొండుపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 122 మందికి ఔట్ పేషెంట్లకు వైద్య సేవలు అందించారు. వైద్యం పొందేందుకు ఆస్పత్రికి రాలేని స్థితిలో ఉన్న ఆరుగురు రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి, వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన మందులను అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణరాజుపేటలో పొలంబడి



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

మాకవరపాలెం: మండలంలోని నారాయణరాజుపేటలో వ్యవసాయశాఖ అధికారులు సోమవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి సేద్యం విభాగం ఇన్‌చార్జి కవిత మాట్లాడుతూ భూసారం తగ్గడానికి గల కారణాలను రైతులకు వివరించారు. పొలాల్లో పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. భూసారం పెంపునకు సంబంధించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సుదర్శన్, అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోండి



ఈఈ రామకృష్ణ

నర్సీపట్నం: విద్యుత్ వినియోగదారులు విధిగా తమ విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని నర్సీపట్నం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ నంబర్ జెరాక్స్ కాపీని విద్యుత్ సిబ్బందికి ఇచ్చి సహకరించాలన్నారు. పూర్వీకుల పేరు మీద విద్యుత్ సర్వీస్ ఉన్నట్లయితే ప్రస్తుతం ఉన్న వారసులు, తమ వారసత్వానికి సంబంధించిన ఆధారాలతో సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా 1921కు కాల్ చేసి, నివృత్తి చేసుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్ సంస్థ ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఈస్టర్న్ పవర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఆన్‌లైన్లో బిల్లులు చెల్లించే వెసులబాటు కల్పించామన్నారు.

డిమాండ్ల సాధనకు దివ్యాంగుల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న దివ్యాంగులు

నర్సీపట్నం: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద దివ్యాంగులు ఆందోళన నిర్వహించారు. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రెట్టింపు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎం.నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌తోనే తాము జీవిస్తున్నామని, పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో పెన్షన్ సరిపోక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రూ.3 వేల పింఛన్‌ను రూ.6 వేలుకు పెంచాలని కోరారు. సంఘ భవనానికి నర్సీపట్నంలో స్థలం కేటాయించాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సెక్రటరీ ప్రసాద్, దివ్యాంగులు పాల్గొన్నారు.

పెద్దేరు.. వరి నాట్లు జోరు

దివంగత మహానేత వైఎస్సార్ ప్రారంభించిన పెద్దేరు జలాశయం.. మూడు మండలాల రైతులకు ప్రధాన సాగునీటి వనరుగా మారింది. జలాశయం ఆధునికీకరణ పనులకు ఆయన బిడ్డ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.84.44 కోట్ల కేటాయింపుతో ఆయకట్టు సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది. గత నెల రోజులుగా వర్షాల్లేకపోయినా పెద్దేరు ఆయకట్టు రైతులు మాత్రం, ముమ్మరంగా నాట్లు వేస్తూ, సాగుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

- నిండు కుండలా పెద్దేరు జలాశయం
- 15 వేల ఎకరాల్లో సాగుకు సన్నద్ధం
- 6,500 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి



పెద్దేరు జలాశయంలో నీటి నిల్వలు



పెద్దేరు ఆయకట్టు భూముల్లో వేసిన వరినాట్లు

మాడుగుల: మండలంలో అత్యధిక జల వనరులుగల పెద్దేరు జలాశయం ఆయకట్టు ప్రాంతంలో ఖరీఫ్ వరిసాగుపై రైతుల్లో ధీమా పెరిగింది. జలాశయం నిండుగా నీటి నిల్వలు చేరడంతో సాగు నీటికి ఢోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జలాశయ క్యాచ్‌మెంట్ ఏరియాలో గత నెల్లో కురిసిన వర్షాలే ఇందుకు కారణమని ఆయనకట్టు ప్రాంత ప్రజలు చెప్తున్నారు. దీంతో జలాశయ అధికారులు రాచకట్టు పంట కాలువ ద్వారా 70 క్యూసెక్కులు, ఆర్ఎంసీ కాలువ ద్వారా 40 క్యూసెక్కుల సాగునీరు సరఫరా చేస్తున్నారు.

6,500 ఎకరాల్లో వరినాట్లు

మండల పరిధిలో గత 25 రోజులుగా చినుకు జాడ లేదు. అయినప్పటికీ జలాశయ ఆయకట్టు ప్రాంతంలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో ఆయకట్టు పరిధిలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. అందుకు అవసరమైన నారు మడులు సిద్ధం చేశారు. ఇప్పటికే ఎడమ, కుడి ప్రధాన కాలువల పరిధిలో 6,500 ఎకరాల విస్తీర్ణంలో వరినాట్లు వేసినట్లు అధికారులు చెప్తున్నారు. మరో వారం రోజుల్లో వరినాట్లు పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఈ ఏడాది వర్షాలు అనుకూలించకపోయినా పంటలకు మాత్రం ఎలాంటి ఢోకా ఉండబోదని రైతులు ఆనందం ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రూ.84.44 కోట్లతో ఆధునికీకరణ

దివంగత మహానేత వైఎస్సార్ ప్రారంభించిన పెద్దేరు జలాశయం ఆధునికీకరణకు నిధులు మంజూరయ్యాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా రూ.84.44 కోట్ల నిధులు మంజూరు చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గతంలోనే ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సాంకేతిక అనుమతులు రావడంతో జాప్యం వల్ల పనులు ప్రారంభం కాలేదు. ఖరీఫ్ పంట కాలం పూర్తయిన వెంటనే సీసీ లైనింగ్ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే మాడుగుల, రావికమతం, బుచ్చయ్యపేట మండలాలకు చెందిన మెట్ట భూములు శివారు ఆయకట్టు వరకు సాగులోకి వస్తాయి. పంట కాలువలు బాగా లేకపోవడం వల్ల ఇన్నాళ్లూ ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యకు పరిష్కారం దక్కనుంది.

రుణపడి ఉంటాం



పెద్దేరు జలాశయం ఆధునికీకరణ పనులు పూర్తయితే మూడు మండలాల మెట్టభూములకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాపై చూపిన దయకు జీవితాంతం రుణపడి ఉంటాం. నిధులు ఎప్పుడో కేటాయించారు. కాలువలకు సీసీ లైనింగ్ పనులు పూర్తయితే సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. – వల్రే రామునాయుడు, రైతు, గాదిరాయి గ్రామం

గృహ సారథులకు సముచిత స్థానం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం నియోజకవర్గ గృహసారథుల సమావేశంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: పార్టీని మరింతగా బలోపేతం చేయడంలో గృహసారథులు పూర్తిస్థాయిలో పనిచేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయి సచివాలయ గృహసారథుల సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ గృహసారథులు కృషిచేయాలన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సమీక్షలో గృహసారథులందరికీ పార్టీ తరఫున భీమా సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పడంతో ఆ దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గృహ సారథుల వివరాలు సేకరించి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. అంకిత భావంతో పనిచేసే ప్రతీ కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని భరోసానిచ్చారు. 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి గృహ సారథులే కీలకమన్నారు. సమావేశానికి చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలకు చెందిన 300 మందికి పైగా గృహసారథులు హాజరయ్యారు. నాలుగు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తా

- రాజాంలో కుళాయి పనులను ప్రారంభించిన విప్ ధర్మశ్రీ



రాజాంలో కుళాయి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. సోమవారం రాజాంలో రూ.కోటీ 23 లక్షలతో ఇంటింటి కుళాయి పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తాగునీటి కోసం బోర్లు, బావుల వద్ద మహిళలు గంటల కొద్దీ నిరీక్షించడం, కిలో మీటర్ల దూరం వెళ్లి నీళ్లు మోసుకు రావాల్సిన కష్టాల నుంచి మహిళలకు విముక్తి కల్పిస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రతి గ్రామంలో మంచినీటి పథకాలు, ఇంటింటి కుళాయిల ఏర్పాటు, తదితర మౌలిక వసతుల్ని ఏర్పాటు చేసి, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. నాలుగు మాసాల్లో ఇంటింటి కుళాయి పనులతోపాటు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ పనులన్నింటినీ పూర్తి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, సర్పంచ్ మరిసా నాని, ఎంపీటీసీ మరిసా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి



స్పందనలో తహసీల్దార్ శ్రీనివాస్ నాయుడుకు ఫిర్యాదు చేస్తున్న గిరిజన ప్రతినిధులు

నాతవరం: కలెక్టర్ తాజాగా పర్యటించిన గిరిజన గ్రామాల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ ఎస్ఎస్‌వీ శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సరుగుడు, సుందరకోట, ఎ.శరభవరం, పీకే గూడెం, ములగపూడి, మర్రిపాలెం, వెన్నలపాలెం, డి.యర్రవరం గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ రెండు పర్యాయాలు గిరిజన ప్రాంతాల్లో పర్యటించారని, ఆయన దృష్టికి తీసుకెళ్లిన సమస్యల్ని యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామన్నారు. అధికంగా పోడు వ్యవసాయం చేసుకునే భూములకు పట్టాలు, హక్కు పత్రాల కోసం రైతులు నివేదించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న గిరిజనులందరికీ హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సుందరకోట పంచాయతీలో రెవెన్యూ సమస్యలపై సర్పంచ్ కొండపల్లి చినతల్లి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.రాజు గిరిజన పెద్దలతో కలిసి స్పందనలో ఫిర్యాదు చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



దేవరాపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

దేవరాపల్లి: మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు భోజన విరామ సమయంలో సోమవారం నిరసన చేపట్టారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు జూలై నెల జీతాలను వెంటనే విడుదల చేయాలని, ఎంటీఎస్‌ను అమలు చేసి వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దంచికొట్టిన వర్షం.. రైతుల్లో హర్షం



చోడవరంలో కురుస్తున్న భారీ వర్షం

చోడవరం/మాడుగుల/గొలుగొండ : వరుణుడు కరుణించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వరినాట్లు వేసే సమయంలో గత కొద్ది రోజులుగా వర్షాలు మొహం చాటేశాయి. దీంతో నీరులేక మెట్ట ప్రాంతాల్లో వరి నాట్లు నిలిచిపోయాయి. ఎప్పుడు వర్షం కురుస్తుందా? అని ఆశగా ఎదురు చూస్తున్న మెట్ట ప్రాంత రైతులకు సోమవారం సాయంత్రం కుండపోతగా కురిసిన వర్షం ఊరటనిచ్చింది.

- చోడవరం పరిసరాల్లో సుమారు 25 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దాదాపు గంటపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురడంతో రోడ్లపై వర్షపునీరు పొంగి ప్రవహించింది. పొలాల్లో నీరు చేరింది. దీంతో దమ్ములు పట్టి వరినాట్లు వేసేందుకు సిద్ధంగా ఉంచిన పొలాలన్నీ వర్షపు నీరుతో నాట్లకు అనుకూలంగా మారాయి. రైతులు వరి నాట్లకు సన్నద్ధమవుతున్నారు.
- మాడుగుల మండలంలో 20 రోజుల తర్వాత సోమవారం భారీ వర్షం కురిసంది. గత నెల్లో ముందుగానే తొలకరి జల్లులు కురవడంతో వరినాట్లు ప్రారంభించారు. ముందుగా వేసిన వరినాట్లు వర్షాలు ముఖం చాటేయడంతో ఎండిపోతాయేమోనన్న రైతుల ఆందోళనకు తాజా వర్షం ఉపశమనం కలిగించింది. మెట్ట భూముల్లో వరి చేలు తెప్పరిల్లుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- గొలుగొండ మండలంలో సాయంత్రం గంటపాటు వర్షం దంచికొట్టింది. మండలంలోని చిన్నయ్యపాలెం, జోగుంపేట, గొలుగొండ, కొత్తమల్లంపేట, కొత్తపాలెం, దారపాలెం ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం రైతుల్ని ఆనందంలో ముంచెత్తింది. భారీ వర్షం కురవడంతో నాట్లు వేసిన రైతులకు ఊరట దక్కగా, నాట్లు వేయని రైతుల నారుమడులకు ప్రాణం పోసింది. మూడు వారాలుగా ఈ ప్రాంతంలో వర్షాల్లేక ఇబ్బంది పడుతున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా హద్దు రాళ్ల ఏర్పాటు



రోలుగుంట రైతుల భూ సరిహద్దులో సర్వే రాళ్లు పాతిస్తున్న వీఆర్వో సాహెబ్

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం ద్వారా సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లోని రైతుల భూముల సరిహద్దులో రాళ్లు పాతించే పనులు తహసీల్దార్ కె.వరహాలు ఆధ్వర్యంలో జోరుగా సాగుతున్నాయి. రోలుగుంట రెవెన్యూ సర్వే నెం.259 పరిధిలో 640 మంది రైతులకు చెందిన 1,041 ఎకరాల పంట భూములున్నాయి. వీటి సర్వే ఇప్పటికే పూర్తయింది. దీంతో నాలుగు రోజులుగా సరిహద్దుల్లో సర్వే రాళ్లు పాతిస్తున్నారు. వీఆర్వో ఎస్కే సన్యాసి సాహెబ్, సర్వేయర్ లక్ష్మణ్‌తో కలిసి 250 మంది రైతులకు చెందిన భూముల్లో సరిహద్దు రాళ్లు పాతారు. ఈ సందర్భంగా వీఆర్వో మాట్లాడుతూ తహసీల్దార్ ఆదేశాల మేరకు, స్థానిక రైతుల సహకారంతో వివాదాలకు తావులేకుండా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఉపాధి పనులపై ప్రజా వేదిక నేడు

చీడికాడ: మండలంలోని 23 పంచాయతీల్లో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి మంగళవారం సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావికమతం: కొత్తకోట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో వడ్డాది ఏడీఏ ఎల్ అప్పలనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజాం నుంచి వచ్చే మెయిన్ లైన్‌లో సాంకేతిక సమస్యలు, సబ్‌స్టేషన్ అప్‌గ్రెడేషన్ పనుల కారణంగా సరఫరాను మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిలిపి వేస్తామన్నారు. ప్రజల సహకరించాల్సిందిగా కోరారు.

సాగునీటి కోసం స్పందనలో రైతుల వినతి



అర్జీదారులతో ఏవో సూర్యనారాయణ

నర్సీపట్నం: ఖరీఫ్ వరి నాట్లు వేసుకునేలా సాగునీరు అందించాలని కోరుతూ తాండవ, రావణాపల్లి జలాశయాల రైతులు ఆర్డీవో కార్యాలయ ఏవో సూర్యనారాయణకు వినతిపత్రం అందించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 39 ఫిర్యాదులు వచ్చాయి. ఆర్డీవో ఇతర అధికారిక కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో కార్యాలయ ఏవో వినతులు స్వీకరించారు. తాండవ జలాశయానికి చెందిన 10, 11 మేజర్ కాలువలకు నీరు అందక నాట్లు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయకట్టు రైతులు పేర్కొన్నారు. ఎండిపోతున్న ఆకు మడులను ట్యాంకర్ల నీటి ద్వారా కాపాడుకుంటున్నామని, కాలువలపై జలాశయం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సాగునీరు అందటం లేదని వాపోయారు. ఆయకట్టుకు నీటిని అందించి ఆదుకోవాలని రైతులు విన్నవించారు. ఆర్డీవో జయరాం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి, పరిష్కరిస్తానని బాధితులకు ఏవో హామీ ఇచ్చారు. స్పందనలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మంచాల' విద్యుత్ సమస్యపై ఎస్ఈ పరిశీలన



మంచాలలో మోడల్ స్కూల్ వద్ద విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

చీడికాడ: మండలంలోని మంచాలలో గత కొంత కాలంగా ఉన్న విద్యుత్ సమస్యపై డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాలకు ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేందర్‌నాథ్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. కోనాం ఫీడర్‌పరిధి శిరిజాం నుంచి మంచాలకు విద్యుత్ సరఫరా చేసే లైన్ చిన్నపాటి గాలి, వర్షం ఉన్నా మరమ్మతులకు గురవుతోంది. మంచాల మోడల్ స్కూల్, బాలికల వసతి గృహం పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పాటూరి రమణ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్పందిన ఆయన కొత్త లైన్ ఏర్పాటుకు విద్యుత్ అధికారులకు లేఖ రాశారు. ఈ మేరకు ఎస్ఈ విద్యుత్ లైన్లను పరిశీలించి, ప్రస్తుతమున్న ఫీడర్‌కు ప్రత్యామ్నాయంగా తురువోలు ఫీడర్‌ను అనుసంధానించి అంతరాయం ఏర్పడిన సమయాల్లో విద్యుత్ సరఫరా చేయాల్సిందిగా ఏఈ వెంకటరావును సూచించారు.

మండల పరిషత్ సమావేశం రేపు

మాకవరపాలెం: ఈ నెల 23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని ప్రగతి నివేదికలతో హాజరు కావాల్సిందిగా సూచించారు.

సిద్ధి వినాయకుడికి పూజా సామాగ్రి

రోలుగుంట: స్థానిక సిద్ధి వినాయకుడి పూజలకు అవసరమైన ఇత్తడి పళ్లెం, మూడు రాగి పాత్రలను భక్తుడు బోళెం అప్పలనాయుడు ఆలయ నిర్వాహకులకు సోమవారం అందించారు. ప్రతి బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు భక్తులు కుటుంబ సమేతంగా వస్తుంటారు. అందుకు పూజాసామగ్రి అవసరం గురించి తెలుసుకున్న అప్పలనాయుడు తాజాగా వాటిని అందించారు. దాతకు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

సమష్టి కృషితో సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, చిత్రంలో కోశాధికారి సత్యనారాయణ, తదితరులు

దేవరాపల్లి: ప్రజాస్వామ్యంపై ప్రతీ పౌరుడిని చైతన్య పరచడమే తమ ధ్యేయమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి, ప్రధాన కార్యదర్శి కేవీఆర్‌వీ ప్రసాద్ తెలిపారు. స్థానిక రైవాడ జలాశయ అతిథి గృహంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి, సమగ్రాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర కోశాధికారి పారేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రధానంగా ఎన్నికల సంస్కరణలు, పాలనా వికేంద్రీకరణ, సమాచార హక్కు చట్టం, గ్రామ సభల నిర్వహణపై యువతలో అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి ఆదిరెడ్డి చినకన్నబాబు, జిల్లా కార్యదర్శి జిలానీ, అన్వర్, రంధి వెంకటరావు, కాటపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్ ఛిద్రం



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న మహిళా పోలీసులు

యలమంచిలి : బాల్య వివాహాలతో భవిష్యత్ ఛిద్రం అవుతుందని తులసీనగర్ సచివాలయ మహిళా పోలీస్ పిళ్లా కుమారి అన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు దిశ పోలీస్ స్టేషన్ సిబ్బంది, యలమంచిలి పట్టణ సచివాలయాల మహిళా పోలీసుల విభాగంతో యలమంచిలి పట్టణంలో సోమవారం తులసీనగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, వాగ్దేవి జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలపై డాక్యుమెంటరీ ప్రదర్శించారు. జిల్లాలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఈ డాక్యుమెంటరీ ప్రదర్శించి బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళలపై దాడులు, ర్యాగింగ్, మహిళల అక్రమ రవాణా వంటి అంశాలను వివరిస్తూ విద్యార్థులు ఏ విధంగా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తులసీనగర్ సచివాలయ మహిళా పోలీస్ పిళ్లా కుమారి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమని తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు బాలికలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కళాశాలల్లో, పాఠశాలల్లో ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని, తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. మహిళల భద్రతకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దేవరాపల్లికి బస్ సర్వీసుల్ని పెంచాలి

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లికి మరిన్ని బస్ సర్వీసులను పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. ఈ మేరకు స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎస్.కోట, విజయనగరం, చోడవరం, అనకాపల్లి కలెక్టర్ ఆఫీస్‌కు బస్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చోడవరం నుంచి దేవరాపల్లికి గతంలో బస్సులు సర్వీసులున నడిచేవని, వాటిని పునరుద్ధరించి, ప్రజల ఇబ్బందుల్ని తొలగించాల్సిందిగా ఆయన అధికార్లకు విజ్ఞప్తి చేశారు.

వెలంకాయలపాలెంలో పశు విజ్ఞానబడి

రోలుగుంట: మండలంలోని కొండపాలెం పంచాయతీ శివారు వెలంకాయలపాలెం గ్రామంలో సోమవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వర్రావు పాల్గొని, పశువుల శాస్త్రీయ పోషణపై రైతులకు అవగాహన కల్పించారు. పశువుల పట్ల తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వం పాడి అభివృద్ధికి రాయితీపై ఇస్తున్న సంపూర్ణ మిశ్రమ దాణా వినియోగం, ప్రయోజనాలను తెలిపారు. ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, రైతులు రాజనాయుడు, పెంటయ్య తదితరులు పాల్గొని వారి సమస్యలను నివృత్తి చేసుకున్నారు.